తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం
4 జూన్ 2026
పేజీలు : 08





మేడ్చల్-మల్కాజిగిరిలో మిన్నంటిన ఉత్పాతం

## ట్యాంకర్ నుంచి ట్యాంక్ వరకు

# చీకటి ఇంధన సామ్రాజ్యం

## నగరంలో పెట్రోల్ చోరీ మాఫియా పంజా

- శివారు ప్రాంతాల్లో గుట్టుచప్పుడు కాకుండా దందా
- ట్యాంకర్లకు కన్నం.. వేల లీటర్ల ఇంధనం మాయ
- ఈ భారీ అక్రమ వ్యాపారానికి చర్లపల్లి అడ్డా
- ప్రభుత్వ ఖజానాకు గండి.. మాఫియాకు కాసుల వర్షం
- బోడుప్పల్ నుంచి ఘట్‌కేసర్ వరకు విస్తరించిన అక్రమ నెట్‌వర్క్?

*ఇది దగా.. భారీస్థాయిలో వేళ్లూనుకున్న దందా. తూనికలు కొలతల శాఖ, విజిలెన్స్, పోలీసు శాఖల కండ్లుగప్పి సాగుతున్న దగా..! వందలు, వేలు కాదు, లక్షలు.. కోట్లల్లో సాగుతున్న దగా. ప్రభుత్వ యంత్రాంగానే పక్కదారి పట్టిస్తూ.. ప్రజల ప్రాణాలను ప్రమాదంలో నెడుతూ జోరుమంటున్న ఇం'ధన' దగా. నివాస ప్రాంతాల నుంచి గుట్టుచప్పడు కాకుండా నిలువునా ముంచేస్తున్న దగా. అక్రమ వ్యాపారానికి పుట్టినిల్లుగా మారి చీకటి సామ్రాజ్యాన్ని చాపకింద నీరులా విస్తరిస్తున్న దగా..!*

**బోడుప్పల్/మేడిపల్లి, జూన్ 03 (జనంసాక్షి) :** మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బోడుప్పల్, మల్లాపూర్, చర్లపల్లి, ఘట్‌కేసర్ ప్రాంతాల్లో అక్రమ పెట్రోల్, డీజిల్ దందా జోరుగా సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చర్లపల్లిలోని ఆయిల్ డిపోల నుంచి బయలుదేరే ట్యాంకర్ల నుంచి ఇంధనం చోరీ చేసి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేసి విక్రయిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పరిశ్రమల ప్రాంతాలు, ఖాళీ షెడ్లు, నిర్మానుష్య ప్రాంతాలను కేంద్రాలుగా చేసుకుని కొందరు అక్రమ వ్యాపారులు ఈ దందా నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. ట్యాంకర్ల నుంచి ఇంధనం తీసి తక్కువ ధరలకు విక్రయించడం, కల్తీ చేసి మార్కెట్‌లోకి పంపించడం వల్ల ప్రభుత్వానికి ఆదాయ నష్టం వాటిల్లుతోంది. ఈ కేంద్రాల వల్ల ఎప్పుడైనా భారీ అగ్ని ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నివాస ప్రాంతాలకు సమీపంలో అక్రమంగా పెట్రోల్, డీజిల్ నిల్వ చేయడం వల్ల ప్రజల ప్రాణాలు సైతం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. విజిలెన్స్ అధికారులు, సివిల్ సప్లైస్ విభాగం, పోలీసు శాఖ ప్రత్యేక దృష్టి సారించి అక్రమ ఇంధన దందాపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

### రహస్య అడ్డాల్లో విక్రయాలు

చర్లపల్లి ఆయిల్ డిపోల నుంచి బయలుదేరే ట్యాంకర్ల నుంచి ఇంధనం చోరీ చేసి, బోడుప్పల్, మల్లాపూర్, ఘట్‌కేసర్ పరిసర ప్రాంతాల్లోని రహస్య అడ్డాల్లో నిల్వ చేసి విక్రయిస్తున్నారని తెలుస్తోంది. వేల లీటర్ల ఇంధనం అక్రమంగా చేతులు మారుతున్నప్పటికీ, ఈ దందాపై పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. మల్కాజిగిరి కమిషనరేట్ పరిధిలోని బోడుప్పల్‌లోని చెంగిచర్ల మై విలాస్ వెనుక ట్యాంకర్ల అడ్డా, రామకృష్ణ నగర్ మల్లాపూర్, గోకుల్ నగర్ రోడ్డు నెంబర్8,9,10,11లలో భారీఎత్తున, పూసల గోదాం వెనుక చర్లపల్లి నుండి రాంపల్లికి వెళ్ళే దారిలో స్మశానవాటిక దగ్గర, ఘట్‌కేసర్ హెచ్‌పీ పెట్రోల్ గోదాం దగ్గర, పంక్చర్ షాప్ పక్కన్న, ఓఆర్ఆర్, తుక్కుగూడ ప్రాంతాల్లో అక్రమ ఇంధన నిల్వ కేంద్రాలు, రహస్య అడ్డాలు ఉన్నాయని విశ్వసనీయంగా తెలిసింది. పరిశ్రమల ప్రాంతాలు, ఖాళీ యార్డులు, నిర్మానుష్య ప్రదేశాలను కేంద్రాలుగా చేసుకుని ఈ దందా సాగుతోందనే ప్రచారం జరుగుతోంది. అడ్డాల్లో పదుల సంఖ్యలో వ్యక్తులు తిరుగుతూ ఎవరైనా వారి అడ్డాలకు వెళ్తే బెదిరింపులకు పాల్పడుతున్నారు.

### హవ్వా.. అధికారులకు తెలియదా..?

రాత్రివేళల్లో ట్యాంకర్ల సంచారం, కొన్నిసార్లు విక్రయాలు వెరసి బోడుప్పల్ నుంచి ఘట్కేసర్ వరకు ఈ అక్రమ నెట్‌వర్క్ ఉన్నట్టు సమాచారం. వేల లీటర్ల ఇంధనాన్ని అక్రమంగా నిల్వ చేయడం, ట్యాంకర్ల రాకపోకలు, రహస్య విక్రయాలు జరుగుతున్నా అధికారుల దృష్టికి వెళ్లలేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వేళ లీటర్ల ఇంధనం ఎటువెళ్తోంది? చోరీ ఇంధన కొనుగోలుదారులు ఎవరు? ఈ మాఫియాకు అండగా నిలుస్తున్న పెద్ద తల ఎవరిదీ..? ప్రభుత్వ ఆదాయానికి లక్షల రూపాయలు గండి పడుతున్నా అధికారులు సైలెంట్‌గా ఉండటం వెనుక అసలు కారణాలేంటీ..? అన్నది తేల్చాల్సిన అవసరం ఉంది. అక్రమ ఇంధన దందాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, రహస్య అడ్డాలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. చీకట్లో సాగుతున్న ఈ ఇంధన దందాలో ఎన్నెన్ని కోణాలో.. ఇంకా వరుసగా మిగిలే ఉన్నాయి.



## నర్సాబాయి కుంట పనుల పరిశీలన



**రాజేంద్రనగర్, జూన్3(జనంసాక్షి)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని బాబుల్ రెడ్డి నగర్‌లో ఉన్న నర్సాబాయి కుంట సుందరీకరణ పనులను ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ అధికారులతో కలిసి పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, డీసీ, ఈఈ, ఇరిగేషన్ శాఖ అధికారులతో కుంట పరిసరాలను పచ్చదనంతో అభివృద్ధి చేసి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందించేలా పార్క్ నిర్మాణ ప్రతిపాదనపై అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ప్రేమదాస్ గౌడ్, డివిజన్ అధ్యక్షుడు ధనుంజయ్, సోమ శ్రీనివాస్, ప్రేమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అలియాబాద్ మున్సిపాలిటీలో మౌళిక వసతుల కల్పనకు కృషి

### చైర్మన్ శిరిష కృష్ణారెడ్డి



**శామీర్ పేట్, జూన్ 3(జనం సాక్షి )** అలియాబాద్ పురపాలక సంఘం పరిధిలోని 9వ వార్డ్ లో మున్సిపల్ జనరల్ నిధులు 5 లక్షల రూపాయల తో చేపట్టిన పనిని చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణరెడ్డి శంఖు స్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ ఖన రెడ్డి మాలతి మాధవ రెడ్డి , మున్సిపల్ కమిషనర్ వెంకట్ రెడ్డి , వార్డు కౌన్సిలర్లు వడగం యమున శ్యామ్ , కైరా గణేశ్, గాదె వెంకటేష్ , మౌనిక వంగరి , హపవత్ వెంకటేష్ , సామాల జశ్వంత్ రెడ్డి, మున్సిపల్ డీఈఈ మహిపాల్ మరియు వార్డ్ వాసులు పాల్గొన్నారు.

## తాండూర్ మున్సిపల్ కమిషనర్‌గా రాకేష్‌రెడ్డి బాధ్యత స్వీకరణ

### మున్సిపల్ కమిషనర్ రాకేష్



**తాండూరు, జూన్ 3 (జనంసాక్షి)** తాండూర్ మున్సిపల్ కమిషనర్ గా పి రాకేష్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. బుధవారం కమిషనర్ ఛాంబర్ లో ఛార్జిన్ని తీసుకున్నారు. చార్జి తీసుకున్న అనంతరం పి. రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రతినిధులు సహకారంతో పట్టణ అభివృద్ధి చేపడతారని తెలిపారు. మోడల్ మున్సిపాలిటీగా మార్చేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తానన్నారు. పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తానని ఆయన వివరించారు. అనంతరం చైర్మన్ పి. నీరజను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతకుముందు మేనేజర్ నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులు, వార్డ్ ఆఫీసర్లు సిబ్బంది, కమిషనర్ ని సన్మానించారు.

## హరీష్ రావు జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



**రామంతాపూర్, జూన్ 3 ( జనం సాక్షి ):** మాజీ మంత్రి, సిద్ధిపేట ఎమ్మెల్యే టి. హరీష్ రావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని రామంతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ యువ నాయకుడు లావంగు నవీన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, హరీష్ రావు జన్మదినాన్ని సేవా కార్యక్రమాల ద్వారా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి అవసరమైన సహాయ సహకారాలు అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుని భవిష్యత్తులో ఆదర్శ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. లావంగు నవీన్ మాట్లాడుతూ, హరీష్ రావు జన్మదినం సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగా స్కూల్ బ్యాగులు పంపిణీ చేయడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. హరీష్ రావు జన్మదినోత్సవం సందర్భంగా విద్యార్థులకు బ్యాగులు పంపిణీ చేయడంపై తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మనబడిలో - మన జ్ఞాపకాలు

- సమస్త పూర్వ విద్యార్థుల సందడి
- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల షాబాద్




**షాబాద్, జూన్ 03(జనం సాక్షి) ;** విద్యను బోధించిన గురువులను స్మరిస్తూ, ఆడి పాడి చదివిన పాఠశాలలోని పాత జ్ఞాపకాలు స్మరించుకుందామని సమస్త పూర్వ విద్యార్థులు ఏకధాటిగా నిలిచి మనబడిలో –మన జ్ఞాపకాలు అంటూ కార్యక్రమాన్ని నిర్వహించదలిచి జూన్ 13వ తారీకున జరుగు మనబడిలో - మన జ్ఞాపకాలు కార్యక్రమానికి సంబంధించిన గోడ పత్రికను బుధవారం షాబాద్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సమస్త పూర్వ విద్యార్థుల బృందం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... 50 సంవత్సరాల నుండి పాఠశాలలో విద్యను అభ్యసించిన పదవ తరగతి బ్యాచ్ ప్రతి ఒక్కరూ కార్యక్రమంలో పాల్గొని సమస్త పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ఎంతో ఘనంగా నిర్వహించుకుందామని అన్నారు. షాబాద్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో సమస్త పూర్వ విద్యార్థులు శ్రీను పంతులు, తమ్మలి రవీందర్, జడల రాజేందర్ గౌడ్, కల్వకోల్ వెంకట్ యాదవ్, కొండా విజయ్ కుమార్, లంబడి నర్సింలు, ధర్పల్లి రవీందర్ గౌడ్, బొబ్బిలి ప్రవీణ్, అన్వర్, పొనమోని రమేష్ యాదవ్, గోవర్ధన్ రెడ్డి, ఏగూరి మల్లికార్జున్, షఫీ, ఆరే శ్రీనివాస్, కావలి బాలరాజ్, విష్ణు వర్ధన్ చారి, రాపోలు నర్సింలు, నరేందర్, శివరాజ్, గుండాల అశోక్, దండు రాహుల్ గుప్తా, కేబుల్ శివ తదితరులు పాల్గొన్నారు.

# పట్టుబడిన ద్విచక్ర వాహన యజమానులు ఎక్కడ?

### ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు



**హయత్ నగర్, జూన్ 3 (జనం సాక్షి)** ఎల్బీనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ రకాల ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన కేసులలో పట్టుబడిన 116 వాహనాలు పోలీసుల ఆధీనం లోనే ఉన్నాయని, వాటికి సంబంధించిన పత్రాలను చూపించి, పెండింగ్ చలనాలు చెల్లించి తీసుకువెళ్లాలని ఎల్బీనగర్ ట్రాఫిక్ ఎస్ హెచ్ ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. అవి పట్టుబడినప్పటి నుండి ఇప్పటివరకు, ఆ వాహనాల యజమానులు వాటి మీద చలానాల రూపంలో ఉన్న జరిమానాలను చెల్లించి తీసుకొని పోలేదని, సదరు వాహన యజమానులకు ఇప్పటివరకు పోస్ట్ ద్వారా నోటీసులు ఇవ్వడంతో పాటు సమాచారం కూడా ఇవ్వడం జరిగిందని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటివరకు ఏ ఒక్కరూ ముందుకు వచ్చి పైన తెలుపబడిన వారి వాహనాలను తీసుకుపోవుటకు రాలేకపోయినందున, చివరి ప్రయత్నం గా ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాల ద్వారా తెలియ చేస్తున్నామని ఇన్స్పెక్టర్ అన్నారు. వాటి యజమానులు స్టేషన్ కి వచ్చి వారి వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు చూపించి, వాటిపై పెండింగ్ లో ఉన్న జరిమానాలను చెల్లించి, తీసుకెళ్లగలరని కోరారు. లేని పక్షంలో చట్ట ప్రకారం, నిబంధనల మేరకు వేలం వేయడం జరుగుతుందని, సదరు వాహన యజమానులకు తెలియపరుస్తున్నామని మీడియా సమావేశంలో తెలిపారు. ఇతరత సమాచారం కోసం 8712662773 సంప్రదించగలరని సిఐ వెంకటేశ్వర్లు సూచించారు.

# డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తా

### కళ్లెం నవజీవన్ రెడ్డి





**హయత్ నగర్, జూన్ 3 (జనం సాక్షి)** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలోని బ్లడ్ బ్యాంక్ కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో చేపట్టిన భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కళ్లెం నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. భూగర్భ డ్రైనేజ్ వ్యవస్థ ఏర్పాటు ద్వారా మురుగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు ప్రజారోగ్య పరిరక్షణకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పనులు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్లకు సూచించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు తమ కాలనీలో అభివృద్ధి పనులు చేపట్టినందుకు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఘనంగా సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు. ఖాదీ బోర్డు కాలనీవాసులు తమ కాలనీలో ఇంకా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజ్ పైప్‌లైన్ నిర్మాణ పనులను పూర్తి చేయాలని మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి ని కోరారు. దీనిపై స్పందించిన ఆయన, సంబంధిత అధికారుల దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి, అవసరమైన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీలైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటామని కాలనీవాసులకు భరోసా కల్పించారు. ప్రజల సమస్యల పరిష్కారం, డివిజన్ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు భానోత్ భాగ్య నాయక్, ఏనుగు మురళీ ధర్ రెడ్డి, ఆంజనేయులు, వెంకటేష్, వీరేష్, నవీన్ రెడ్డి, ఖాదీ బోర్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు సునీత, నాగి రెడ్డి, యుగేందర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలోని అన్ని నగరాల కంటే హైదరాబాద్‌లోనే అధిక ఫీజులు

**• ప్రైవేట్ విద్యా సంస్థల నిలువు దోపిడిని అడ్డుకుందాం • మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి**

**హయత్ నగర్, జూన్ 3 (జనం సాక్షి)** హైదరాబాద్ ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని మన్సూరాబాద్ బీజేపీ కార్యాలయం లో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు మధ్య తరగతి కుటుంబాల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని మాజీ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, రంగారెడ్డి జిల్లా బీజేవైఎం నాయకులు పొట్లపల్లి సాయిరాం గౌడ్, మన్సూరాబాద్ డివిజన్ బీజేవైఎం అధ్యక్షులు పారంద సాయి లతో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు భరించలేక తమ పిల్లలను ఇతర విద్యాసంస్థల్లో చేర్పించాలని నిర్ణయించుకున్న తల్లిదండ్రులు ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీ లు) ఇవ్వాలని కోరినప్పటికీ, కొన్ని యాజమాన్యాలు వాటిని జారీ చేయకుండా అనవసరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. విద్య అనేది ప్రతి విద్యార్థి హక్కు అని, దానిని వ్యాపారంగా మార్చి పెద్ద పెద్ద "బ్రాండ్స్" పేరుతో అధిక ఫీజులు వసూళ్లు. తల్లిదండ్రు లపై అధిక భారం మోపడం సమంజసం కాదని మండిపడ్డారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించడం తో పాటు, విద్యార్థులకు ఎటువంటి ఆటంకాలు లేకుండా టీసీ లు జారీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రతి ఒక్క ప్రైవేట్



పాఠశాలల్లో యూనిఫామ్స్, బుక్స్, నోటు బుక్స్, ఇతర స్కూలుకు సంబంధించిన మెటీరియల్స్ అని చెప్పి స్కూల్స్ లోనే ప్రతి విద్యార్థి దగ్గర నుండి వేలకు వేలు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై ఎంఈఓ, డీఈవో, విద్యాశాఖ ఉన్నతాధికారులు ఇప్పటివరకు స్పందించడం లేదు, ఎలాంటి చర్యలు తీసుకోకుండా వారికి మద్దతుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నగరంలో స్కూల్ బ్రాండ్ల పేరుతో ప్రతి సంవత్సరం వార్షికోత్సవాల పేరుతో విద్యార్థుల నుండి రూపాయలు 2000/- నుండి రూపాయలు 3000/- వరకు వసూలు చేసి వారి స్కూల్ బ్రాండ్ ను పబ్లిసిటీ చేసేందుకు పిల్లల వద్ద నుండి డబ్బులు తీసుకునే నియమాలు ఎక్కడివి? అని డిమాండ్ చేస్తూ వీటిపై వెంబడే సంబంధిత విద్యాశాఖ అధికారులు స్పందించాలని హెచ్చరించారు. నియోజకవర్గంలో ప్రతి విద్యార్థుల తల్లిదండ్రుల సమస్యలను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని, అవసరమైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేసి మా పార్టీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఉద్యమ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దు

**నిరుడు శేఖర్ ముదిరాజ్**



**రాజేంద్రనగర్,జూన్3(జనం సాక్షి)** అంగన్‌వాడీ ఉద్యోగుల హక్కులను కాలరాయొద్దని కిస్మత్‌పూర్ మాజీ ఉపసర్పంచ్, బీజేపీ నాయకుడు నిరుడు శేఖర్ ముదిరాజ్ పేర్కొన్నారు. బుధవారం అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు కలిసి తమ ఉద్యోగ భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం కొత్తగా ప్రీ-ప్రైమరీ, పీఎం శ్రీ కేంద్రాలను ఏర్పాటు చేసే నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది అంగన్‌వాడీ ఉద్యోగుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా నిరుడు శేఖర్ ముదిరాజ్ మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థ చిన్నారుల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, ఉద్యోగుల హక్కులు, ఉద్యోగ భద్రతకు ప్రభుత్వం పూర్తి హామీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పునఃసమీక్షించి అంగన్‌వాడీ ఉద్యోగులకు అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు స్వరూప, సరిత, శైలజ, సుజాత, హెల్పర్లు తారా, బీజేపీ నాయకుడు లక్ష్మణ్ సాయి యాదవ్ పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుని కలిసిన ఎవరెస్ట్ అధిరోహించిన

# పలుకునూరి పల్లునూరి తులసి రెడ్డి

**నిజాంపేట్ జూన్ 3( జనం సాక్షి)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం శంభీపూర్ లోని కార్యాలయంలో బుధవారం బౌరంపేట్ నివాసులు పల్లునూరి తులసిరెడ్డి ఇటీవల ప్రపంచంలోన్ ఎత్తయిన శిఖరం మౌంట్ ఎవరెస్ట్ ని అధిరోహించడం సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించిన మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సముద్ర మట్టానికి 8,848.86 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన అత్యంత క్లిష్టమైన శిఖరం మౌంట్ ఎవరెస్ట్, ఆక్సిజన్ కొరత, తీవ్ర చలి, మంచు తుఫాన్లు, ప్రమాదకరమైన మార్గాల మధ్య ఈ శిఖరాన్ని అధిరోహించడం అసాధారణ ధైర్యసాహసాలకు నిదర్శనం అని అలాంటి అరుదైన ఘనతను సాధించి భౌరంపేట్ గ్రామం పేరును జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చాటిన ఐరన్ మ్యాన్ పల్లునూరి తులసిరెడ్డి ని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అభినందించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి అచంచల పట్టుదల,



క్రమశిక్షణ, కఠోర సాధన యువతకు ఆదర్శంగా నిలుస్తాయని ఎమ్మెల్సీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ మిద్దాల బాల్ రెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు నర్సారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పల్లునూరి విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు పోలీస్ గోవింద్ రెడ్డి, భుజంగం రెడ్డి, మహిపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# స్వాతి రెసిడెన్సీ కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

**ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి**



**హయత్ నగర్, జూన్ 3 (జనం సాక్షి)** మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని స్వాతి రెసిడెన్సీ కాలనీలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారం కోసం స్వాతి రెసిడెన్సీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ని వారి కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు మాట్లాడుతూ కాలనీలో గతంలో ఏర్పాటు చేసిన యూ.జీ.డీ, ఇంటర్నల్ పైప్‌లైన్ వ్యవస్థల కారణంగా పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటి వలన స్థానిక నివాసితులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అసోసియేషన్ ప్రతినిధులు వివరించారు. కాలనీ పార్క్ ప్రహరీ గోడ, జిమ్ పరికరాలను అందుబాటులోకి తీసుకోనిరావాలని కోరారు. కాలనీలోని రోడ్లు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులకు సంబంధించిన సమస్యలను కూడా ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాలనీ ప్రజల సమస్యలను పరిశీలించి, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మన్సురాబాద్ డివిజన్ భారస పార్టీ యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి, స్వాతి రెసిడెన్సీ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోమనాథ్, ఉపాధక్షులు భాస్కర్ గౌడ్, వరుణ్, సురేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# ఎలిమినేడు గ్రామంలో ముగిసిన రోడ్డు వివాదం

**ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో సామరస్య పరిష్కారం**

**ఇబ్రహీంపట్నం, జూన్ 3(జనం సాక్షి )** ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడు గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా నానుతున్న రోడ్డు సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. గ్రామ పరిధిలోని జినుకుంట్ల సత్తయ్య, కొట్టముల శ్రీనివాస్ ఇళ్ల మధ్య ఉన్న రోడ్డు మూసివేయడంతో చాలా ఏళ్లుగా స్థానిక ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దీర్ఘకాలిక సమస్యపై ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి గ్రామస్తులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు మంకాల శేఖర్ రెడ్డి, కురుమ యాదవ సంఘం అధ్యక్షుడు ఇక్కే మహేందర్ సంయుక్తంగా చొరవ తీసుకున్నారు. వివాదంలో ఉన్న ఇరు కుటుంబాల పెద్దలను ఒకచోట కూర్చోబెట్టి, సామరస్యపూర్వకంగా చర్చలు జరిపారు. పరస్పర అంగీకారంతో సమస్యను పరిష్కరించి, మూసివేసిన రోడ్డును తిరిగి తెరిపించారు. చాలా ఏళ్ల నాటి రోడ్డు సమస్య పరిష్కారం కావడంతో ఎలిమినేడు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శ్రేయస్సును కాంక్షించి రోడ్డు తీయడానికి అంగీకరించిన జినుకుంట్ల సత్తయ్య, కొట్టముల శ్రీనివాస్ లకు గ్రామస్థులు మరియు నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పిట్టల యాదగిరి, ఇక్కే చంద్రయ్య, పట్నం బీరప్ప, సత్తయ్య, అరిగే జంగయ్య, కొట్టముల మల్లయ్య, చిట్టె బాల్రాజు, గుర్జానీ మాధవశేఖర్, అంజయ్య, కొట్టముల శ్రీశైలం, రావుల రంజిత్, పట్నం శివశంకర్, ఐలయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# రైతుల గోసను ప్రభుత్వం పట్టించుకోదా

**శామీర్ పేట్, జూన్ 3(జూన్ )** రైతుల వడ్లు తీసుకోవడానికి ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గు చేటని శామీర్ పేట్ డివిజన్ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధ వారం శామీర్ పేట్ ప్రధాన చౌరస్తాలో సొసైటీలో రైతులు పండించిన వడ్లను తీసుకోకపోవడంతో రైతులు రాస్తా రోకో చేశారు. దీంతో చాలా



వాహనాలు నిల్చిపోవడంతో తీవ్ర ఆటంకం ఏర్పడింది. అరగంట సేపు ప్రయాణికులు ఎండ లోనే నిల్చిపోయే పరిస్థితి వచ్చింది. సమాచారం తెలుసుకున్న శామీర్ పేట్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్, సిబ్బందితో వచ్చి రైతులను పోలీస్ స్టేషన్ కు తీసుకెళ్లారు. వాహనాల రాకపోకలను క్లియర్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శశివర్ధన్ రెడ్డి, సిపిఐ ప్రసాద్, రైతులు నర్ల రమేష్, యాదగిరి, కొమురయ్య, బిక్షపతి, ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సెంట్రింగ్ కాంట్రాక్టర్ల డిమాండ్లను అంగీకరించం

- కాప్రా, దమ్మైగూడ, నాగారం, కీసర, రాంపల్లి ప్రాంతాల బిల్డర్ల సమావేశం
- తమ డిమాండ్ల సాధనకు పనుల నిలిపివేతకు సిద్ధం



**కాప్రా, జూన్, ( జనం సాక్షి) :** సెంట్రింగ్ కాంట్రాక్టర్లు చేస్తున్న డిమాండ్లను తాము అంగీకరించమని పలువురు ఇంటి నిర్మాణ బిల్డర్లు పేర్కొన్నారు. పద్మశాలి టౌన్షిప్ లో కాప్రా, దమ్మైగూడ, నాగారం, కీసర రాంపల్లి ప్రాంతాల బిల్డర్లు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బిల్డర్లు మాట్లాడుతూ... సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఏకపక్ష నిర్ణయాలతో సెంట్రింగ్ పనుల రేట్లు పెంచడం సరికాదన్నారు. భవన నిర్మాణాలు చేపడుతున్న తాము ఎంతో కష్టనష్టాలకు ఓర్చుతూ బతుకు బండిని సాగిస్తున్నామని, ఇలాంటి తరుణంలో సెంట్రింగ్ కాంట్రాక్టర్లు రేట్లను పెంచాలని పనులను నిలిపివేయడం ఎంతవరకు సమంజసం అన్నారు. హైటెక్ సిటీ, మాదాపూర్, తదితర అభివృద్ధి చెందిన ప్రాంతాలకు ఇక్కడి కాప్రా ధమ్మాయిగూడ, నాగారం, కీసర, రాంపల్లి ప్రాంతాలకు భవన నిర్మాణ రంగంలో రేట్ల విషయంలో చాలా తేడాలు ఉన్నాయన్నారు. అభివృద్ధి చెందిన ప్రాంతాలల్లో ఇచ్చే రేట్లను సెంట్రింగ్ కాంట్రాక్టర్లు ఇక్కడ కూడా అవే రేట్లను చెల్లించాలనడం సమంజసం కాదన్నారు. ఇప్పటికే భవనాల విక్రయాలకు మార్కెట్ లేక లక్షల రూపాయలు నష్టపోయామని వాపోయారు. ప్రస్తుతం వ్యాపారం లేక అల్లాడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఇంటి నిర్మాణ బిల్డర్లుగా తమ డిమాండ్ నెరవేరే వరకు... తాము కూడా పనులను నిలిపి వేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. ఇక బిల్డర్ లందరూ ఐక్య సాధనకు సంఘముగా ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో బిల్డర్ల నూతన కమిటీని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు బిల్డర్లు తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కాప్రా ధమ్మాయిగూడ నాగారం కీసర రాంపల్లి తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 300 మంది బిల్డర్లు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం

### చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**చేవెళ్ల, జూన్ 03 (జనంసాక్షి)** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యమని, గ్రామాల్లో అర్హులైన పేదలందరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండలంలోని చన్వెల్లి, ఇక్కరెడ్డిగూడ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన 8 ఇందిరమ్మ ఇళ్లను స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే యాదయ్య ప్రారంభించి లబ్దిదారులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. గ్రామాల్లో గుడిసేలు ఉండొద్దన్న లక్ష్యంతో ప్రభుత్వం అర్హులైన పేదలకు రాజకీయ పార్టీలకు అతీతంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్పర్సన్ సమతావెంకటే రెడ్డి, గ్రామ సర్పంచ్ గుండన్నగారి ప్రభాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ దీపక్ రెడ్డి, చేవెళ్ల సొసైటీ చైర్మన్ దేవర వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పెంటయ్యగౌడ్, వైస్ చైర్మన్ రాములు, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, ఎనికేపల్లి సర్పంచ్ మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్లు మధుసూధన్ గుప్తా, కెసారం శ్రీనివాస్, లావణ్యశంకర్, భీమయ్య, నాయకులు గిరిధర్ రెడ్డి, పాండు, లియాకత్, వార్డు సభ్యులు, గ్రామస్తులు, లబ్దిదారులు, మహిళలు తదితరులు ఉన్నారు.

# రాజకీయ అఖిలపక్షం సమావేశంలో ఉద్యమకారులకు అనుకూలంగా సూచన చేయండి



**హయత్ నగర్, జూన్ 3 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్ర బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చంద్రరావు, ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి లను కలిసిన తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ రాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ రాష్ట్ర బృందం అఖిలపక్షం సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులకు కాలయాపన చేయకుండా తొందరగా అమలు చేయాలని, ప్రభుత్వం పై మీ పార్టీ పక్షాన ఉద్యమకారులకు అనుకూలంగా ప్రభుత్వానికి సూచన చేయవలసిందిగా రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం బృందం విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్షం రాజకీయ పార్టీల సమావేశంలో ఉద్యమకారుల కు అనుకూలంగా ప్రభుత్వానికి సూచనలు చేయవలసిందిగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు, అసెంబ్లీ పార్టీ ఫ్లోర్ లీడర్ ఫ్లోర్ లీడర్ ఏలేటి మహేశ్వర్ రెడ్డి ని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్, బీఎస్పీ, తెలుగుదేశం, ఎంఐఎం, తెలంగాణ ఆమ్ ఆఫ్ ది, సిపిఐ, సిపిఎం, అన్ని రాష్ట్ర కార్యాలయాలలో ఉద్యమకారులకు న్యాయం, ఆత్మగౌరవం, అమరుల ఆకాంక్షలు నెరవేరి, గౌరవించే విధంగా మీ మీ పార్టీలు సూచనలు చేసి, ప్రభుత్వం ఉద్యమకారులను గా గౌరవించుకునే ఏర్పాట్లు కు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అన్ని పార్టీ లు కూడా సానుకూలంగా స్పందించారు. వారు కూడా తప్పకుండా ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం జరగాలని ఆత్మగౌరవం పెంచే విధంగా సూచనలు చేస్తామని వారు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జెనిగె విష్ణువర్ధన్, బూందిల్ల ఇంద్ర కుమార్, రంగారెడ్డి జిల్లా ప్రచార కార్యదర్శి కిషోర్ లాల్, హయత్ నగర్ మండల అధ్యక్షులు వస్పరి బలరాం, తదితరులు పాల్గొన్నారు.

# హరీష్ రావు జన్మదినం సందర్భంగా హరిత కార్యక్రమం



**చేవెళ్ల, జూన్ 03 (జనంసాక్షి)** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదినం సందర్భంగా బుధవారం చేవెళ్ల మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ముడిమ్యాల్ పీఏసీఎస్ డైరెక్టర్, బీఆర్ఎస్ నాయకుడు కేసారం నరేందర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించవచ్చని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత కూడా అందరిపైనే ఉందని పేర్కొన్నారు. హరీష్ రావు ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పచ్చదనం పెంపొందించే కార్యక్రమాల్లో ప్రజలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# సీనియర్ పాత్రికేయులు ప్రహల్లాద చారికి పితృవియోగం పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**బొంరాస్ పేట, జూన్ 3 (జనం సాక్షి):** అనారోగ్యంతో బాధపడుతూ మే 13న మండల కేంద్రానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ప్రహల్లాద చారి తండ్రి విశ్రాంత ఉద్యోగి రాఘవేంద్ర చారి మృతి చెందారు. విషయం తెలుసుకున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి బుధవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. కుటుంబ పెద్దదిక్కును కోల్పోతే ఆ లోటు పూడ్చలేనిదని, అధైర్య పడోద్దని అండగా ఉంటామని భరోసా కల్పించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి,నారాయణరెడ్డి,రవి గౌడ్,శ్రావణ్ గౌడ్,మహేష్,అంజిలయ్య, లచ్చప్ప,రమేష్, నర్సింలు తదితరులు ఉన్నారు.

# పద్మశాలి టౌన్షిప్‌లో మంచినీటి సమస్య పరిష్కరించాలి

### జలమండలి ఎండికి వినతి పత్రం అందజేసిన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



**కాప్రా, జూన్ 3 (జనం సాక్షి ) :** ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని పద్మశాలి టౌన్షిప్‌లో నెలకొన్న మంచినీటి సమస్యను పరిష్కరించేందుకు టౌన్షిప్ ప్రతినిధులతో కలిసి బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అశోక్ రెడ్డిని కలిసి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ టౌన్షిప్‌లో తాగునీటి సరఫరా సక్రమంగా లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎండీ దృష్టికి తీసుకెళ్లారు. సమస్య తీవ్రతను వివరించి, శాశ్వత పరిష్కారం కోసం కొత్త మంచినీటి పైప్లైన్ల ఏర్పాటుతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని కోరారు. సానుకూలంగా స్పందిస్తూ, జలమండలి ఎండి అశోక్ రెడ్డి పద్మశాలి టౌన్షిప్‌కు తప్పకుండా మంచినీటి పైప్లైన్ ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. అలాగే రిజర్వాయర్ నిర్మాణం కోసం అవసరమైన స్థలాన్ని గుర్తించి కేటాయించే ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. స్థలం కేటాయింపు పూర్తయిన వెంటనే రిజర్వాయర్ నిర్మాణ పనులు ప్రారంభించి, టౌన్షిప్ ప్రజలకు నిరంతరాయంగా మంచినీటి సరఫరా అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈడి పంకజ కు రాయడం జరిగింది. ఆమె త్వరలోనే వచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతు ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఎల్లప్పుడూ ముందుంటామని, పద్మశాలి టౌన్షిప్ ప్రజల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే వరకు కృషి కొనసాగిస్తామని తెలిపారు.

# జూన్ 12న వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవిర్భావ దినోత్సవం

**రాజేంద్రనగర్, జూన్3(జనంసాక్షి)** రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం 62వ ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 12న నిర్వహించనుంది. ఈ సందర్భంగా "భారత హరిత విప్లవ సాధనలో ఇందిరా గాంధీ విశేష సేవలు" అంశంపై జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తెలిపారు.

ఈ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీని ముఖ్య అతిథిగా ఆహ్వానించగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షత వహించాలని కోరారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్ రెడ్డి, వ్యవసాయ ఆర్థికవేత్త ప్రొఫెసర్ మధురా స్వామినాథన్, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. 1966లో ఇందిరా గాంధీ ప్రారంభించిన విశ్వవిద్యాలయ మౌలిక వసతులకు 60 ఏళ్లు పూర్తైన సందర్భంగా ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి తెలిపారు.

# వర్షాకాల సన్నద్ధతపై అధికారుల సమీక్ష



**ఘట్కేసర్, జూన్ 3 ( జనం సాక్షి ):** వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో శాఖల మధ్య సమన్వయం సమర్థవంతంగా ఉండాలని ఘట్కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి సూచించారు. వర్షాకాల సంసిద్ధత నేపథ్యంలో మున్సిపల్, ట్రాఫిక్, పోలీసు శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో వర్షాల కారణంగా ఏర్పడే సమస్యలను ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై విస్తృతంగా చర్చించారు. లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ కాకుండా డ్రైనేజీలు, నాలాల్లోని పూడిక, చెత్తను వెంటనే తొలగించాలని మున్సిపల్ సిబ్బందికి ఆదేశించారు. నీటి ప్రవాహానికి ఆటంకాలు కలగకుండా కల్వర్టులను పూర్తిగా శుభ్రపరచాలని సూచించారు. తెరిచి ఉన్న మ్యాన్‌హోల్స్‌కు మూతలు ఏర్పాటు చేసి, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. చెట్లు విరిగిపడటం, నీరు నిల్వ కావడం వంటి అత్యవసర పరిస్థితులకు తక్షణ స్పందన అందించేందుకు డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (డీఆర్ఎఫ్) బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దోమల నివారణ, అంటువ్యాధుల నియంత్రణ కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. భారీ వర్షాల సమయంలో ట్రాఫిక్ అంతరాయం కలగకుండా నీరు నిలిచే ప్రాంతాలను గుర్తించి ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేయాలని ట్రాఫిక్ పోలీసులకు సూచించారు. రోడ్లపై గుంతలు, ప్రమాదకర ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేసి వాహనదారులను అప్రమత్తం చేయాలని తెలిపారు. లా అండ్ ఆర్డర్ పోలీసు విభాగం అధికారులు మున్సిపల్ శాఖతో సమన్వయం చేసుకుంటూ 24 గంటల కంట్రోల్ రూమ్ ద్వారా పరిస్థితులను పర్యవేక్షించాలని, అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. వర్షాలు, వరదలకు సంబంధించిన తప్పుడు ప్రచారాలను అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ రాజీవ్ రెడ్డి, డిప్యూటీ ఇంజనీర్ నరేష్, ట్రాఫిక్ విభాగం సీఐ రవీందర్, లా అండ్ ఆర్డర్ సీఐ బాలస్వామి తదితర అధికారులు పాల్గొన్నారు.

## నివాస కాలనీల సర్వే నెంబర్లను రిజిస్ట్రేషన్ కార్యాలయం నిషేధిత జాబితా నుంచి తొలగించాలి

- జిల్లా కలెక్టర్‌కు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి వినతి
- చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ మను చౌదరి.



**మేడ్చల్ కలెక్టరేట్, జూన్ 3.**కాప్రా, జూన్ 3 ( జనం సాక్షి ) : కాప్రా సర్కిల్ కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివ సాయి నగర్, ఇందిరానగర్, సాయి నగర్, మీనాక్షి నగర్, మారుతి కాలనీ, టీచర్స్ కాలనీ, చర్లపల్లి బి.యన్.రెడ్డి నగర్ లకు చెందిన పలు సర్వే నెంబర్లను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో నుంచి తొలగించాలని, యు ఎల్ సి నుంచి పరిష్కారం చూపాలని కోరుతూ బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులతో మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరిని కలుసుకొని విజ్ఞాపన పత్రాలు సమర్పించారు.కుషాయిగూడ, చర్లపల్లి పరిధి కాలనీలలో 40 ఏళ్ల క్రితం వందలాది కుటుంబాలు ఇండ్లు నిర్మించుకొని నివాసముంటున్న, మరికొన్ని ఖాళీ స్థలాలకు చెందిన సర్వే నెంబర్లు కాప్రా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో నిషేధిత జాబితాలో, యూ ఎల్ సి లో ఉన్నాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్ తో గుర్తు చేశారు.ఫలితంగా కూతురు పెళ్లి కోసం, పిల్లల చదువుల కోసం, అనారోగ్యం బారిన పడిన సమయంలో వైద్య ఖర్చులకోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందడం కష్టతరంగా మారిందన్నారు. ఎల్ఆర్ఎస్ బిల్డింగ్ పర్మిషన్ ఉన్న ఇండ్లు,స్థలాలకు సంబంధించిన రిజిస్టర్ డాక్యుమెంట్లకు విలువ లేకపోవడంతో అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కలెక్టర్ మన చౌదరి తో విన్నవించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్ ,కాలనీ కమిటీల సమాఖ్య సిసిఎస్ అధ్యక్షులు ఎంపల్లి పద్మా రెడ్డి, నాయకులు జౌండ్ల ప్రభాకర్ రెడ్డి, బివి నరసింహారెడ్డి, పలుగుల మహేందర్, కాటేపల్లి శివారెడ్డి, బిక్షపతి , నాగూర్, వెంకటేశ్వర్ రావు, సుభాష్, బాలు, నవీన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యతోనే బంగారు భవిష్యత్తు

- మండల ఉపసర్పంచ్ సంఘం అధ్యక్షురాలు గోటూరి అనితరెడ్డి
- ఎస్ఎస్సీలో మండలంలోనే సెకండ్ టాపర్గా నిలిచిన శ్రావంతికి నగదు, సన్మానం



**మొయినాబాద్ జనం సాక్షి జూన్.03** నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉంటుందని మండల ఉపసర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు గోటూరి అనిత రెడ్డి, కేతిరెడ్డిపల్లి సర్పంచ్ గోడుగు యాదయ్యలు పేర్కొన్నారు. మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతి చదివిన విద్యార్థిని టి.శ్రావంతి మండలంలోనే ద్వితీయ స్థానం మార్కులు 522 సాధించి కేతిరెడ్డిపల్లి పాఠశాలలో టాపర్ నిలిచారు. ఈ సందర్భంగా మండల ఉపసర్పంచ్ల సంఘం అధ్యక్షురాలు, కేతిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ గోటూరి అనితరెడ్డి కుమారుడు గోటూరి విష్ణువర్ధన్రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థినికి సన్మాన కార్యక్రమంతో పాటు షీల్డ్, పది వేల నగదు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోడుగు యాదయ్యతో పాటు ఉపసర్పంచ్ అనితరెడ్డిలు పాల్గొని విద్యార్థిణీ శ్రావంతిని సన్మానించి షీల్డ్ బహుకరించారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడంలో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. పేద విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్నప్పటికి వారికి ఉన్నత విద్యకు వెళ్లాలని ఎంతో ఆశ ఉంటుందన్నారు. నాణ్యమైన విద్యతోనే విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉందన్నారు. విద్యతోనే ఆర్థికాభివృద్ధి అన్న చందంతో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి తారాబాయి, వార్డు సభ్యులు బొడ సుజాత, మంగలి నవీనా, అనిమని పావని, జంగిటి మహేందర్, గోటికే శ్రీకాంత్, ముజాఫర్, ప్రవీణ్, యాతం శ్రీకాంత్, రేనెట్ల సుధాకర్, యూత్ నాయకులు గోటూరి వంశీవర్ధన్రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సిద్ధయ్య, నర్సింహ్మాచారి, వెంకటయ్య చారి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మోత్కుపల్లి గ్రామ పంచాయతీకి జాతీయ పురస్కారం




**కోట్ పల్లి జూన్ 03(జనంసాక్షి):** రాజధాని ఢిల్లీలో బుధవారం జరిగిన జాతీయ పంచాయతీ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా కోట్‌పల్లి మండలం మోత్కుపల్లి గ్రామ పంచాయతీ ప్రతిష్టాత్మక జాతీయ పురస్కారాన్ని అందుకుంది. సుపరిపాలన విభాగంలో జాతీయ స్థాయిలో 'దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయత్ సతత్ వికాస్ పురస్కార్' అవార్డును కేంద్ర పంచాయతీ రాజ్ శాఖామాత్యులు శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ (లలన్ సింగ్) చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ అవార్డును వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మోత్కుపల్లి గ్రామ సర్పంచ్ బైండ్ల అమృతమ్మ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి సంయుక్తంగా అందుకున్నారు.గ్రామంలో అమలు చేస్తున్న పారదర్శక పాలన, ప్రజా సేవలు, వినూత్న అభివృద్ధి కార్యక్రమాలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్లు నిర్వాహకులు తెలిపారు. సుపరిపాలన విభాగంలో దేశవ్యాప్తంగా ఉత్తమ పనితీరు కనబరిచిన పంచాయతీలకు ఈ పురస్కారాన్ని అందజేస్తారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ, జిల్లా పంచాయతీ అధికారి, డివిజనల్ పంచాయతీ అధికారి, కోట్‌పల్లి మండల ఎంపీడీఓ, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు. జాతీయ స్థాయిలో వికారాబాద్ జిల్లాకు గుర్తింపు లభించడంపై జిల్లా అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

## ఘట్కేసర్ వీవీజ పరిధిలో ఘట్కేసర్ సర్కిల్ 06లోని రైల్వే వంతెన దగ్గర రోడ్డు

- నారాయణ గార్డెన్ నుండి ఎదులాబాద్ రోడ్డు వరకు ఉన్న సమస్యలపై కమిషనర్‌కి తెలియజేసిన ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్



**ఘట్కేసర్ , జూన్ 03 ( జనం సాక్షి )**ఘట్కేసర్ డివిజన్ 6 శివారెడ్డిగూడ శరోడ్ నుండి మాధవరెడ్డి వంతెన వరకు ఎ=ణజూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి ల్యాండ్ అక్విజిషన్ చేపట్టడంలో ఘట్కేసర్ సర్కిల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు.ఘట్కేసర్ డివిజన్ 6 శివ రెడ్డి గూడ శ రోడ్ నుండి మాధవరెడ్డి వంతెన వరకు ఎ=ణజూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి ఘట్కేసర్ సర్కిల్ అధికారులు మీనా మేషాలు లెక్కిస్తూ 100 ఫీట్ల రోడ్డు ఏర్పాటుకు అవసరమయ్యే ల్యాండ్ అక్విజిషన్ చేయకుండా నోటీసులు ఇవ్వకుండా కాలయాపాన చేస్తున్నారు రోడ్డు ఉన్న మ్యానువల్స్, పైప్ లైన్ ,కూడా రిపేరింగ్ చేయకుండా కాంట్రాక్టర్ మరియు ఘట్కేసర్ సర్కిల్ అధికారులు నిమ్మకు నిరతనట్టుగా వ్యవహరిస్తున్నారు.అలాగే గత 3 నెలల క్రితం కూడా ఈ దీని పైన ఫిర్యాద్ చేసిన పట్టించుకోకుండా నారాయణ గార్డెన్ నుండి లక్కు వైన్స్ ఎదులాబాద్ రోడ్డు వరకు సాంక్షన్ అయిన టెండర్ అయిన రోడ్డు ప్రారంభించకుండా ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ఘట్కేసర్ గ్రామ పరిధిలోని రైల్వే వంతెన నిర్లక్ష్యం ఎ=ణజూ రోడ్డు నిర్లక్ష్యం మరియు వివిధ అభివృద్ధి పనులు ఏర్పాట్లలో ఘట్కేసర్ సర్కిల్ అధికారుల నిర్లక్ష్యం అన్ని కలిపి ఘట్కేసర్ డివిజన్ ఆరు ప్రజలకు ప్రత్యక్ష నరకం చూపిస్తున్నారు కేవలం ఘట్కేసర్ డివిజన్ 6 ప్రజలను పనులు వసూలు చేస్తున్నప్పటికీ వనరులుగా భావిస్తున్నారు అధికారులు ప్రజల బాధను కష్టాలను తీర్చుటలో త్రీ వర అలసత్యం, నిర్లక్ష్యం వహిస్తూ ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండా అధికారులు నిరోధకులుగా వ్యవహరిస్తున్నారు. ఘట్కేసర్ డివిజన్ 6 సమస్యలపై దృష్టి సారించి కమిషనర్ పరిష్కరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జీూజ నాయకులు మారం లక్ష్మారెడ్డి,పొట్లచెరుపు శ్రీరాములు,నజ్జీర్,అహ్మద్,మనిక కుమార్,సారా శ్రీనివాస్ గౌడ్,కెఫా,శివరాత్రి సురేష్,తస్నీర్ హరీష్,సుబ్బారావు,శివశంకర్,సురేష్,సంతోష్,పాల్గొన్నారు.

# అర్హుల ఓట్ల తొలగింపు కుట్రలను అడ్డుకోవాలి

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**సికింద్రాబాద్ (జనం సాక్షి) :** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) పేరిట అర్హులైన ఓటర్ల పేర్లను తొలగించేందుకు కుట్రలు జరుగుతున్నాయని, బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా వ్యవహరించి మన ఓటు బ్యాంకును పదిలపరుచుకోవాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు (కేటీఆర్) పిలుపునిచ్చారు. బుధవారం సీతాఫలమండీ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ బీఆర్ఎస్ ప్రతినిధుల సమావేశం జరిగింది. బీఆర్ఎస్ యువ నేత తీగుల్ల రామేశ్వర గౌడ్ అధ్యక్షత వహించిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ పద్ధతుల్లో ఓట్లను తొలగించాలని చూస్తోందని, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఉండి అర్హుల ఓట్లను కాపాడాలని దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ స్పీకర్, సికింద్రాబాద్ శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావు గౌడ్ మాట్లాడుతూ.. సికింద్రాబాద్ నియోజకవర్గం మొదటి నుంచి తెలంగాణ వాదానికి కంచుకోటగా నిలిచిందని, ఇక్కడి ఓటర్లను తాము ఎల్లప్పుడూ చైతన్యవంతులను చేస్తూనే ఉన్నామని స్పష్టం చేశారు. అనంతరం మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పూర్తిగా అప్రజాస్వామ్య పద్ధతులను పాటిస్తూ పాలిస్తున్నారని తీవ్రంగా విమర్శించారు. బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరాన్ని విచ్ఛిన్నం చేసేందుకు జరుగుతున్న కుట్రలను పార్టీ శ్రేణులన్నీ కలిసికట్టుగా అడ్డుకోవాలని కోరారు. సమావేశ అధ్యక్షత వహించిన యువ నేత రామేశ్వర గౌడ్ మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలంతా ఐక్యమత్యంగా వ్యవహరించి ఓటర్ల జాబితా సవరణతో పాటు పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియను కూడా విజయవంతం చేయాలని సూచించారు. ఈ నియోజకవర్గ ప్రతినిధుల సభలో ముషీరాబాద్ శాసనసభ్యులు మూటా గోపాల్, కంటోన్మెంట్ ఇంచార్జ్ క్రిశాంక్, మాజీ ఎమ్మెల్సీ సలీం, బీఆర్ఎస్ యువ నేతలు తీగుళ్ళ కిశోర్ కుమార్, త్రినేత్ర గౌడ్, సికింద్రాబాద్ పార్లమెంటు ఇంచార్జ్ తలసాని సాయి కిరణ్ యాదవ్, పార్టీ నేత జైసింహా పాల్గొన్నారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు సామాల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాల ప్రసన్న లక్ష్మీ శ్రీనివాస్, సమన్వయకర్త రాజా సుందర్, ఎన్నికల ఇంచార్జ్ డీ. రాజేందర్ పాల్గొన్నారు.

# పచ్చి రొట్టె సాగు-భూమి బాగు

- **జనుము-జీలుగ విత్తనాలు 50 శాతం సబ్సిడీపై పంపిణీ**
- **ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**కడ్తాల్ జూన్ 03(జనంసాక్షి):** ఆమనగల్ పట్టణ కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రంలో జనుము,జీలుగ విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్ తో కలిసి ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల భూసారం తగ్గి,దిగుబడులు క్షీణిస్తున్నాయి. ఫలితంగా రైతులకు పెట్టుబడి ఖర్చులు అధికమవుతున్నాయి. ఈ సమస్యను అధిగమించడానికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట జనుము, జీలుగు విత్తనాల ఎరువులను సాగు చేసి,భూసారాన్ని మరియు పంట దిగుబడులను పెంచుకోవచ్చని తెలిపారు.పచ్చిరొట్ట ఎరువుల వల్ల భూమి గుల్లబారి,వర్షపు నీరు భూమిలోకి బాగా ఇంకుతుంది.నేలలో సేంద్రియ పదార్థం చేరడంతో సూక్ష్మజీవులు వృద్ధి చెంది,జీవ రసాయనిక చర్యల ద్వారా నేల సారం, ఉత్పాదకత సామర్థ్యం పెరుగుతాయి. అలాగే ఇది కలుపు మొక్కలు పెరగకుండా నివారిస్తుంది.పచ్చిరొట్ట ఎరువుల పంట పూత దశకు రాగానే నేలలో కలియదున్నడం ద్వారా అధిక పరిమాణంలో నేలకు పోషకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు కౌన్సిలర్ ఎనుముల రమేష్,మాజీ మండల అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,బిఆర్ఎస్ నాయకులు సైదులు గౌడ్,మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేష్ నాయక్,పిఎసిఎస్ సిఈఓ పద్మాకర్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్,పిఎసిఎస్ వైస్ ఛైర్మన్ సత్యం,ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ప్రొప్రైటర్ చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.



# దైవచింతనతో మానసిక ప్రశాంతత

- **ఘనంగా కడ్తాల్ చెన్నకేశవ స్వామి ఆలయ పాలకవర్గ ప్రమాణ స్వీకారం**
- **ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా**

**కడ్తాల్ జూన్ 03(జనంసాక్షి):** దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆమనగల్ సింగల్ విండో ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు.బుధవారం కడ్తాల్ శ్రీ చెన్నకేశవ స్వామి ఆలయ ఛైర్మన్ గా గూడూరు జంగారెడ్డి,సభ్యులుగా రమేష్ గౌడ్,పిప్పళ్ళ యాదయ్య,బాచిరెడ్డి మంజుల,రాంచందర్ నాయక్ లను ఆలయ ఈవో మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన గంప వెంకటేష్ గుప్తా ఆలయ ఛైర్మన్ గూడూరు జంగారెడ్డి తో పాటు సభ్యులను శాలువా పూలమాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన పాలకవర్గం ఆలయ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధి కోసం తన శక్తి మేరకు కూడా కృషి చేస్తానని గంప వెంకటేష్ గుప్త తెలిపారు. ఈ కార్యక్రమంలో కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి,ఉపసర్పంచ్ యాదిరెడ్డి,ఆమనగల్ మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి,వార్డు సభ్యులు కేశవులు గౌడ్,నాగరాజు,కొప్పు కృష్ణ,డిసిసి ఉపాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ రెడ్డి,మాజీ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి,అమృతం పాండు,కృష్ణ,గుద్దేటి సత్యనారాయణ గుప్తా,గుద్దేటి వెంకటేష్ గుప్తా,గుద్దేటి వీరేందర్ గుప్తా,గూడూరు సురేందర్ రెడ్డి,బాచిరెడ్డి రమణారెడ్డి,ఏ.సంతోష్,కంబాలపల్లి అంజి,రామచంద్రి,మంగళపల్లి నరసింహ,జంగయ్య,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శారదా బిచ్య నాయక్,బాచిరెడ్డి వెంకటరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## అల్వాల్ చెరువుల సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళిక

**అల్వాల్, జూన్ 3(జనంసాక్షి):** అల్వాల్ సర్కిల్ పరిధిలోని కొత్తచెరువు, చిన్న రాయుడు చెరువులను పూడికతీసి, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని మల్కాజ్‌గిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోట లక్ష్మీకాంతరెడ్డి అధికారులను కోరారు. బుధవారం ఆయన కాంగ్రెస్ పార్టీ 'ఎ' బ్లాక్ అధ్యక్షుడు శేఖర్‌తో కలిసి ఆయా చెరువులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెరువుల ప్రస్తుత పరిస్థితి, గుర్రపుడెక్క సమస్య, పూడిక పేరుకుపోవడం వంటి అంశాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీకాంతరెడ్డి మాట్లాడుతూ.. చెరువుల పరిరక్షణ, సుందరీకరణకు అధికారులు తక్షణమే స్పందించి ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేసి అమలు చేయాలన్నారు. స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చెరువుల చుట్టూ వసతులను మెరుగుపరచాలని సూచించారు.



## అట్టహాసంగా మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు జన్మదిన వేడుకలు

**కడ్తాల్ జూన్ 03(జనంసాక్షి):** మాజీ మంత్రి వర్యులు సిద్దిపేట శాసనసభ్యులు, తన్నీరు హరీష్ రావు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాక్స్ ఛైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, పాక్స్ వైస్ ఛైర్మన్ దోనాదుల సత్యం,కౌన్సిలర్ పాపిశెట్టి రాము హాజరై బీఆర్ఎస్ పార్టీ నాయకులు సమక్షంలో కేక్‌ను కట్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధికి హరీష్ రావు కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. హరీష్ రావు నాయకత్వ స్ఫూర్తితో కల్వకుర్తి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనమళ్ళ రమేష్,నాయకులు అనంతుల సైదులు గౌడ్,కడ్తాల్ మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,చలిచీమల సతీష్, గుజ్జరి గోపి,పూసల భాస్కర్, జంతుక కిరణ్, రాముల మహేష్, శ్రీను నాయక్, రేపని శివ, తదితరులు పాల్గొన్నారు.

## మియాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణానికి

# త్వరలో సీఎం శంకుస్థాపన

- **శేరిలింగంపల్లి అభివృద్ధికి 2 వేల కోట్లు**
- **సీఎంసి ప్రధాన కార్యాలయ భవనానికి కూడా శంకుస్థాపన**
- **530 కోట్లతో 6 లేన్ ఫ్లైఓవర్, అండర్ పాస్‌లు**
- **యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇతర పనులు వేగం**
- **అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దే లక్ష్యం**



**శేరిలింగంపల్లి, జూన్ 03 (జనంసాక్షి):**
శేరిలింగంపల్లి నియోజకవర్గం మియాపూర్ చౌరస్తాలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి అతి త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకోబోతున్నట్లు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ పేర్కొన్నారు. ఈ మేరకు బ్రిడ్జి శంకుస్థాపన స్థలం, సభా ప్రాంగణం ఏర్పాట్లను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్ తదితరులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.

మియాపూర్ చౌరస్తా నుంచి ఆల్విన్ కాలనీ చౌరస్తా వరకు 530 కోట్ల రూపాయలతో 6 లేన్ బై డైరెక్షనల్ ఫ్లైఓవర్, 24 మీటర్ల వెడల్పు హఫీజ్‌పేట్ నుంచి మియాపూర్ వరకు 3 లేన్ యూని డైరెక్షనల్ అండర్ పాస్, బాచుపల్లి నుంచి ఆల్విన్ చౌరస్తా వరకు 3 లేన్ యూని డైరెక్షనల్ అండర్ పాస్ నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. ఈ పనులు పూర్తయితే మియాపూర్, ఆల్విన్ చౌరస్తాలతో పాటు ముంబై హైవే పై ట్రాఫిక్ సమస్యలు ఎక్కువగా తీరతాయన్నారు.

అదేవిధంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి కూడా త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందని అరికెపూడి గాంధీ తెలిపారు. మాదాపూర్ డివిజన్ ఖానామెట్‌లోని మొండికుంట చెరువు వద్ద 10 ఎకరాల్లో 200 కోట్లతో నిర్మించనున్న ఈ భవన సముదాయం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఉపయోగపడుతుందన్నారు.

అంతేకాకుండా 10 కోట్లతో కొండాపూర్, చందానగర్‌లో కోర్ అర్బన్ పాఠశాల, 459 కోట్లతో గచ్చిబౌలి ఐఐటి జంక్షన్ ఫ్లైఓవర్, 220 కోట్లతో ఖాజాగూడ్ జంక్షన్ ఫ్లైఓవర్, 308 కోట్లతో లింగంపల్లి ఆర్‌ఓబి ఫ్లైఓవర్ వంటి అనేక అభివృద్ధి పనులు కొనసాగుతున్నట్లు ఎమ్మెల్యే వివరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామి నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని, సమగ్ర అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని అరికెపూడి గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ పర్యటనలో సీఎంసీ కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, డీసీ బాలకృష్ణ, ఏసీపీ రవికిరణ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

